సమస్యల వలయంలో కాలనీ

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- వరుస దొంగతనాలతో కాలనీవాసుల బెంబేలు
- మౌలిక సదుపాయాలు కల్పించాలంటున్న కాలనీ వాసులు



గోతుల మయంగా రోడ్లు



నున్నలో జగనన్న కాలనీ

విజయవాడరూరల్: నున్న గ్రామంలోని జగనన్న కాలనీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు లేక అక్కడ నివసించే ప్రజానీకం నానా అవస్థలు పడుతున్నారు. లేఅవుట్లు వేసినప్పుడు తాత్కాలికంగా నిర్మించిన రబ్బీస్ రోడ్లు పెద్ద పెద్ద గోతులుపడి నడవటానికి వీల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీళ్లు నిలబడి బురదలో రాకపోకలు సాగించాల్సిన దయనీయమైన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో వర్షాలకు పెరిగిన చెట్ల మధ్య పాముల భయంతో ఇంట్లో నుంచి బయటకు రావడానికి సైతం భయపడుతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో జగనన్న కాలనీలో ఉండలేక పోతున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా విజయవాడ రూరల్ మండలంలోని నున్న, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి, అంబాపురం గ్రామాలకు చెందిన 5,681 మందికి ఇళ్ల స్థలాలను మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టింది. సుమారు 650 కుటుంబాల వారు ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో..

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరంన్నర కాలంలో కాలనీలో నివసిస్తున్న ప్రజలకు కనీస సదుపాయాలను కల్పించలేక పోయిందని నివాసితులు విమర్శిస్తున్నారు.

ఎమ్మెల్యేకు విన్నవించినా..

ఇటీవల సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు నున్న విచ్చేసిన ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్‌కు జగనన్న కాలనీ వాసులు రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని, బస్సు సదుపాయం కల్పించాలని కాలనీ వాసులు కోరారు. ఎమ్మెల్యే సంబంధిత పంచాయతీరాజ్ శాఖ అధికారులకు రోడ్ల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని చెప్పారని సమాచారం. అయితే ఇంత వరకు అంచనాలు కూడా వేసిన దాఖలాలు లేవు. పైపులైను లీకులతో నీరు వృథాగా పోతున్నా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని అంటున్నారు. వర్షాలు కురిసి వాగులు పొంగినప్పుడు కాలనీ వాసులు చినకంచి వద్ద వంతెన లేకపోవడంతో కాలనీకి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. గత సంవత్సరం వాగులు వచ్చినప్పుడు ప్రభుత్వ అధికారులు పొంగుతున్న వాగులు పరిశీలించి వంతెన నిర్మించడానికి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు వంతెన నిర్మాణం ఊసే లేదు.

జోరుగా దొంగతనాలు..

కాలనీలో తాళాలు వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు జరుగుతున్నాయి. పనులకు వెళుతున్న కూలీలు, కార్మికుల ఇంటి తాళాలు పగులగొట్టి గ్యాస్ పొయ్యిలు, గ్యాస్ బండలు, ఇంటిలో నగదు, విలువైన వస్తువులను దొంగలించుకు పోతున్నారు. గ్రామ పంచాయతి ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ప్యానెల్ బోర్డులు, వీధిదీపాలు, మంచినీటి మోటార్లు సైతం దొంగిలించుకుపోతున్నారు. దొంగతనాల నివారణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇకనైనా జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవిస్తున్నారు.

అధికారులు స్పందించాలి



మా నున్న జగనన్న కాలనీలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అడుగుకో గుంత ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కురిస్తే నడిచేందుకు సరైన మార్గం లేక నానా అవస్థలు పడుతున్నాం. దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

– షేక్ హుస్సేన్, జగనన్న కాలనీ వాసి

గ్రాంటు రావాల్సి ఉంది



మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నుంచి గ్రాంటు రావాలి. గ్రాంటు రాగానే పనులు ప్రారంభిస్తాం. జగనన్న కాలనీలో నున్న గ్రామ పరిధి వరకు వీధి దీపాలను ఏర్పాటు చేశాం. పైపు లైను రిపేర్లు చేయిస్తున్నాం.

– కె.సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి, నున్న గ్రామం

స్వాహా చేసిన సొమ్ము రికవరీ చేయించండి

జిల్లా కలెక్టర్‌కు సర్పంచి వినతి

పెనమలూరు: పెదపులిపాక గ్రామ పంచాయతీలో పూర్వ కార్యదర్శులు స్వాహా చేసిన నిధులను జిల్లా అధికారులు రికవరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పెదపులిపాక గ్రామ సర్పంచి గుంటూరు శ్రీనివాసాచౌదరి కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా కలెక్టర్‌కు మరో సారి ఫిర్యాదు చేశామని తెలిపారు. పెదపులిపాక గ్రామ పంచాయతీలో 2019 సంవత్సరం వరకు పని చేసిన ఇద్దరు క్యాదర్శులు పంచాయతీ సొమ్ము దుర్వినియోగం చేశారన్న అభియోగాలపై సస్పెన్షన్‌కు గురయ్యారన్నారు. గ్రామ ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసిన రూ.9 లక్షల నిధులను పంచాయతీకి జమ చేయలేదని తెలిపారు. గతంలో తాను కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా అధికారులు వచ్చి కంటితుడుపు చర్యగా పరిశీలించి వెళ్లారని, నయాపైసా సొమ్ము పంచాయతీకి జమ కాలేదన్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ కల్పించుకొని నిధుల రికవరీకి ఆదేశించాలని కోరారు.

యూరియా కొరతపై రైతుల ఆందోళన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం తిప్పనగుంటలో యూరియా కొరతపై రైతులు ఆందోళనకు దిగారు. గ్రామంలోని పీఏసీఎస్ ఎదుట సోమవారం రైతులు పెద్ద ఎత్తున గుమ్మిగూడి నిరసన వ్యక్తం చేశారు. సకాలంలో యూరియా సరఫరా చేయకపోవటంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని రైతులు వాపోయారు. రోజుల తరబడి యూరియా అందకపోవటంతో పంట నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపై రైతులు మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దీనిపై తక్షణమే స్పందించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం యూరియా స్టాకు లేదని, మరో రెండు, మూడు రోజుల్లో స్టాకు వచ్చే అవకాశం ఉందని పీఏసీఎస్ అధికారులు చెప్పారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అవగాహనతోనే హెచ్‌ఐవి నిర్మూలన



గన్నవరం రూరల్: అవగాహనతోనే హెచ్‌ఐవి నిర్మూలన సాధ్యమని జిల్లా రిసోర్స్‌పర్సన్ మౌనిక అన్నారు. మండలంలోని జక్కులనెక్కలంలో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్-2025లో భాగంగా రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. హెచ్‌ఐవి సురక్షితం కాని రక్తమార్పిడి ద్వారానే వస్తుందని ఆమె తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పీ నిస్సి ప్రీతం, లింక్ వర్కర్ సదాలక్ష్మి, ఏఎన్ఎం మార్తమ్మ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



పెనమలూరు: యనమలకుదురు గ్రామం లాకు సెంటర్‌లో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ నూతన కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. ప్రభుత్వం 9 మందితో ఆలయ నూతన కమిటీని ప్రకటించింది. కమిటీ చైర్మన్‌గా కమ్మిలి నాగేశ్వరరావు, సభ్యులు సీహెచ్.రాంబాబు, ఎస్.విష్ణుభూపతి, ఎం.శివపార్వతి, బాణావత్‌నాగమ్మ, ఎ.రమేష్‌మారుతీకుమార్, వక్కలగడ్డ సామ్రాజ్యం, ఆర్.యువరాజు, కొడాలి కనకదుర్గ ప్రమాణ స్వీకారం చేశారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా అర్చకుడు ఎస్.కోటేశ్వరరావు ఉంటారు. తొలుత కమిటీ సభ్యులు గ్రామంలో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అమ్మవారి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీ పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుంది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం కోళ్లఫారం రోడ్డు, బీఎంపీఎస్ రోడ్డు, పాల్ల బజారు, వికాస్ స్కూల్ రోడ్డు, నందమూరి ప్రసాదరావు రోడ్డు, సాయి బాబా టెంపుల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మట్టి ప్రతిమల పంపిణీ



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో సోమవారం గ్రామస్తులు కారంపూడి సతీష్ సౌజన్యంతో మట్టి గణపయ్య ప్రతిమలను పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు చేతుల మీదుగా భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని చెప్పారు. సమాజ హితం కోరుతూ భక్తులకు 600 మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు.

ఎరువులను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తే చర్యలు



కంకిపాడు: ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని తహసీల్దార్ వీ.భావనారాయణ హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి ఉషారాణి, ఇతర అధికారులతో కలిసి పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం విస్తృతంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ నిర్ణీత ధరలకే ఎరువులు విక్రయించాలని, ఎరువుల నిల్వకు, రికార్డులకుతేడా ఉంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎరువులను మోతాదుకు మించి వినియోగించకుండా సూచనలు అందించాలని సూచించారు. ఎరువుల దుకాణాల్లో నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. ఎస్ఐ డి.సందీప్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరతపై గరం గరం

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో చర్చ
- యూరియాను అందించాలని వైఎస్సార్‌సీపీ సభ్యుల డిమాండ్



మండల పరిషత్ సమావేశంలో చర్చిస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: యూరియా కొరతపై మండల పరిషత్ సమావేశం గరం గరంగా సాగింది. యూరియా అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయించుకుంటూ రైతులను దోచుకుంటున్నారని వైఎస్సార్ సీపీ సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న యూరియా కొరతపై సభ్యులు ధ్వజమెత్తారు. వ్యాపారులు అధిక ధరలకు యూరియా విక్రయిస్తూ బ్లాక్ మార్కెట్ సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు అవసరమైన యూరియాను సమృద్ధిగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వ్యవసాయాధికారులు మాట్లాడుతూ రైతులు అధికంగా యూరియా వినియోగిస్తున్నారన్నారు. ప్రస్తుతం యూరియా నిల్వ లేదని, తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఉత్సవ విగ్రహాలం కాదు?

తాము ఉత్సవ విగ్రహాలం కాదని పలువురు సభ్యులు సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులకు ఎలాంటి సమాచారం ఇవ్వటం లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలతోనే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అధికారులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. స్మార్ట్ రైస్‌కార్డుల పంపిణీ కార్యక్రమం తమకు సమాచారం అందించలేదని దుయ్యబట్టారు. అధికారులు పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. మద్దూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని సమస్యలపై ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, కాసరనేనివారిపాలెం సర్పంచ్ పి.వరప్రసాద్‌లు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ వీ.భావనారాయణ, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోలవరం కాల్వగట్ల మట్టి అక్రమ తవ్వకాలు



పోలవరం కాల్వను ఆనుకొని మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాలు



పోలవరం కాల్వను ఆనుకొని మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతం

పట్టించుకోని అధికారులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పోలవరం కాల్వ గట్ల మట్టి అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా జేసీబీ మిషను పెట్టి మట్టి అక్రమంగా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్ మట్టి వెయ్యి రూపాయలకు విక్రయిస్తున్నారు. పెద్ద పెద్ద గోతులు పెట్టి మట్టి తవ్వడం వలన ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు నిలబడి మరో పోలవరం కాల్వ కోసం తవ్వకాలు చేస్తున్నారా అనే విధంగా కనబడుతున్నాయి. భవిష్యత్తులో నీటి ప్రవాహానికి కాల్వ గట్లు తెగిపోయి ప్రమాదాలకు అవకాశం ఉందని పరిసర రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు తెలిసే మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని, అందుకే పట్టించుకోవడం లేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. నున్న, పాతపాడు గ్రామాల సరిహద్దుల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న వారు అధికార పార్టీ నాయకుల అండదండలతోనే వ్యవహారం చీకటి వ్యాపారం సాగిస్తున్నారని చెప్పుకొంటున్నారు. పోలవరం డీఈ స్థాయి అధికారి కార్యాలయం నున్న గ్రామంలో ఉండగానే ఇలాంటి దారుణాలు చోటుచేసుకోవడం అధికార యంత్రాంగం పనితీరుకు నిదర్శనమంటున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలు ఆపేసి కాల్వను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలి



మంతెన అధ్యక్షుడు వీరంకి రాంబాబును సత్కరిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

కంకిపాడు: పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడిగా వీరంకి రాంబాబు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా గంపా గోపి, తిరుమలశెట్టి రామ్మోహన్‌రావు, కొండేటి కనకమహాలక్ష్మి, తిరువీధుల శామ్యూల్, కార్యదర్శులుగా గురువిందపల్లి శివప్రసాద్, కొండేటి సాంబశివరావు, వెలిశెల సత్యసాగర్, ఉప్పలూరి మల్లేశ్వరరావుతో కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరిగినమంచిని ఇంటింటికీ వివరించాలన్నారు. పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని విజ్ఞప్తిచేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న దాడులను పటిష్ఠంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, నాయకులు కొండవీటి వెంకట సు బ్బారావు, బందెల సుబ్బారావు,కలపాల వజ్రాలు, సర్పంచ్ వీరంకి వెంకట రమణ, నాయకులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

గన్నవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తహసీల్దారు కే. వెంకటశివయ్య స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. మండలంలోని 49 రేషన్ షాపుల పరిధిలో 28,360 కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచి గూడపాటి తులసీమోహన్, మాజీ ఉప సర్పంచి జాస్తి శ్రీధర్, ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: పట్టణంలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య ప్రారంభించారు. తహసీల్దార్ వీ.భావనారాయణ, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, చిట్టూరి నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, వీరంకి శ్యాం, పులి శ్రీనివాసరావు, అన్నే రామారావు, షేక్ చిన్న నాసర్ వలీ, వడ్డాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నియంత్రణలో భాగస్వాములవ్వండి

సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ అరుణశ్రీ



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి అరుణశ్రీ

కేసరపల్లి(గన్నవరం): బాల్య వివాహాల నియంత్రణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ ఎస్.అరుణశ్రీ పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. చిన్న వయ స్సులోనే ఆడపిల్లలకు పెళ్లి చేయడం వల్ల మానసికంగా, ఆరోగ్యపరంగా సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాల గురించి ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని తెలిపారు. ఆడ పిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమానిక, సీఐ బీవీ.శివప్రసాద్, డెప్యూటీ తహసీల్దారు ఎస్.భవాని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్.నాగపద్మావతి, బార్ అసోసియేషన్‌కు చెందిన రాంకూరి ప్రకాష్, అమర్తల సోమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రెయిన్‌పై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయొద్దు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం పడమట రామాలయం ఎదురుగా పంచాయతీ డ్రెయిన్‌పై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయవద్దని గ్రామానికి చెందిన ఢిల్లీ వెంకటేశ్వరరావు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే ఆ డ్రెయిన్‌పై ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడానికి డ్రెయిన్‌పై దిమ్మలు నిర్మించారని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై పునరాలోచన చేయాలని వెంకటేశ్వరరావు కోరారు.

పేదల పూరిపాకలు తొలగింపు

అడ్డుకున్న బాధితులు



పొక్లెయిన్ ఎదుట బాధితులు

ఉయ్యూరు రూరల్: డొంక రోడ్లో పేదల పూరిపాకలు తొలగించేందుకు అధికారులు సిద్ధమవటంతో ఆ ప్రాంత బాధితులు అడ్డుకున్న ఘటన మండలంలోని కాటూరులో సోమవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. కాటూరు గ్రామంలో సుమారు 25 సంవత్సరాల నుంచి 20 నిరుపేద దళిత కుటుంబాలు డొంక రోడ్డు వెంట పూరిగుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు. ఇటీవల డొంక రోడ్డును సీసీ రోడ్డుగా లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించారు. అయితే ఆ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు రాజకీయ కక్షతో, కుల వివక్షతతో కక్ష సాధింపు చర్యలో భాగంగా ఆక్రమణ తొలగించాలని సంబంధం లేని వ్యక్తులతో బినామీ సంతకాలు చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మండల స్థాయి అధికారులను ఆదేశించడంతో సోమవారం కాటూరు పంచాయతీ అధికారులు పొక్లెయిన్‌తో రేకుల షెడ్లు, పూరి గుడిసెలను తొలగించేందుకు పోలీసులతోపాటు వచ్చారు. దీంతో స్థానిక నిరుపేదలు తమకు న్యాయం చేయాలని అధికారులకు విన్నవించారు. స్థానికులకు, అధికారుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం, పోలీసులకు బాధితులకు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. బాధితులు పొక్లెయిన్ ఎదుట బైఠాయించారు. ఎంపీడీవో, డెప్యూటీ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, పోలీసుల సహకారంతో రెండు రేకుల షెడ్లను పొక్లెయిన్‌తో తొలగించారు. దీంతో బాధితులు అధికారుల తీరును తీవ్రంగా వ్యతిరేకించటంతో చేసేదేమీ లేక ఉన్నతా ధికారులకు సమాచారం ఇచ్చి వెళ్లిపోయారు. అనంతరం బాధితులు పంచాయతీ కార్యదర్శి సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేద్దాం

కంకిపాడు: దోమల నిర్మూలన చర్యలతో వ్యాధులకు అడ్డుకట్ట పడుతుందని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక అన్నారు. ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కంకిపాడు, గొడవర్రు, ప్రొద్దుటూరు గ్రామాల్లో దోమల నిర్మూలన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నీటి నిల్వ గుంతల్లో గంబూషియా చేపలు విడిచిపెట్టారు. డాక్టర్ సంతోష చంద్రిక మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. గంబూషియా చేపలు దోమల లార్వాను తినటం ద్వారా దోమల వ్యాప్తికి అడ్డుకట్ట పడుతుందన్నారు. ప్రాణాంతక వ్యాధులు దరిచేరకుండా ఉంటాయన్నారు. గొడవర్రులో నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి దీపిక, వీఆర్‌ఓ రఘురాంప్రసాద్, మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ గోపాలకృష్ణ, రాచమళ్ల శ్యాంప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఏఎన్ఎం భవానీ పాల్గొన్నారు.

శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించండి

కంకిపాడు: శాంతి యుత వాతావరణంలో వినాయక ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎస్ఐ డి.సందీప్ సూచించారు. స్థానిక పోలీసు స్టేషన్ ప్రాంగణంలో ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎస్ఐ సందీప్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను నిర్వహించే సమయంలో అన్ని అనుమతులు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అనుమతులు లేకుండా మండపాలు, డీజేలు ఏర్పాటు చేయటం నిషేదమన్నారు. పండుగ పేరుతో రాజకీయ, కుల, మత వివాదాలకు తెరతీసే చర్యలు మానుకోవాలన్నారు.

ఆర్థిక ప్రగతి సాధించాలి

కంకిపాడు: ఆర్థికంగా అభ్యున్నతి సాధిస్తేనే కుటుంబాలు ప్రగతి బాటన నడుస్తాయని నవ జీవన్ బాలభవన్ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ వసంతకుమారి అన్నారు. కంకిపాడు పాశం లక్ష్మణస్వామి నగర్‌లో సోమవారం ఆర్థిక ప్రగతి, లోకల్ యాక్షన్ కమిటీ క్లాక్ సమావేశం నిర్వహించారు. మేనేజర్ వసంత కుమారి మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను వినియోగించుకుని అన్ని విధాలా ప్రగతి సాధించాలన్నారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలకు యువత బానిసలు కాకుండా చైతన్యం చేయాలన్నారు. కుటుంబాన్ని అభివృద్ధి పథాన నడిపించుకోవటంలో మహిళలు ప్రధాన పాత్ర వహించాలని కోరారు. లెర్నింగ్ టీచర్ ఎం.పెద్దింట్లమ్మ, స్థానికులు పాల్గొన్నారు.

పోలవరం కాల్వ వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం వికాస్ కాలేజి రోడ్డులోని పోలవరం కాల్వలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు నున్న పోలీసు స్టేషన్ సీఐ పి.కృష్ణమోహన్ తెలియజేశారు. సోమవారం సీఐ కృష్ణమోహన్, పంచాయతి కార్యదర్శి కె.సురేష్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ బారికేడ్లు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. భక్తులు నిబంధనలు పాటించాలన్నారు. యర్కారెడ్డి కోటిరెడ్డి ఉన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ.5.09 లక్షల విరాళం



హనుమాన్‌జంక్షన్ రూరల్: మండల కేంద్రమైన బాపులపాడులోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన అయ్యప్ప స్వామి ఆలయానికి వృద్ధ దంపతులు రూ.5.09 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని దాతలు మండల వెంకట సత్యనారాయణమూర్తి, లక్ష్మీ రంగనాయకమ్మ దంపతులు హనుమాన్ జంక్షన్‌లోని వారి నివాసంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, గూడపాటి రత్నశేఖర్, కొల్లి వెంకట్రావు, తమిరి రమేష్‌లకు సోమవారం అందించారు. అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన వృద్ధ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఆర్కే బోర్‌వెల్స్ అధినేత మేడికొండ రామకృష్ణ మరో రూ.50 వేలు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు.